జాతీయ బీసీ లిబరేషన్ టైగర్ ఫోర్స్ వైస్ ప్రెసిడెంట్‌గా డా.చంద్రశేఖర్


డాక్టర్ చంద్రశేఖర్‌కు నియామక పత్రం అందజేసిన ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ లిబరేషన్ టైగర్ ఫోర్స్ వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో డా.చంద్రశేఖర్‌కు నియామక పత్రాన్ని ఎంపీ ఆర్.కృష్ణయ్య, జాతీయ బీసీ కో-ఆర్డినేటర్ ర్యాగా రుషి అరుణ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆర్.కృష్ణయ్య పుట్టుకతోనే నాయకుడయ్యారని, ఏ పార్టీ నాయకుడు తయారు చేయలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ లిబరేషన్ టైగర్ ఫోర్స్ అధ్యక్షుడు జి.రాజగోపాల్‌యాదవ్, జాతీయ బీసీ యువజన సంఘం ఉపాధ్యక్షుడు కిషోర్‌యాదవ్, నాయకులు నీల వెంకటేష్, కౌశిక్, వంశీ, బాలయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌కు ఐద్వా మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, కూలీలకు ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా కార్మిక, రైతు, కూలీ సంఘాలు ఈ నెల 20న నిర్వహిస్తున్న సమ్మె గ్రామీణ బంద్‌కు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. మంగళవారం ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అంబానీ, ఆదానీ వంటి ప్రైవేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అమ్మేస్తున్నదని ఆరోపించారు. సింగరేణి, రైల్వేలు, ఎల్ఐసీ, జీఐసీ, మైనింగ్, ఆయిల్, ఉక్కు వంటి విలువైన దేశ సంపదను ప్రైవేట్‌పరం చేస్తున్నదని దుయ్యబట్టారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నదని విమర్శించారు. పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, విద్యుత్ సవరణ బిల్లు రద్దుచేయాలని రైతులు చేస్తున్న పోరాటంపై ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ నెల 20న దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌కు ఐద్వా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి


సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షుడు రాములు తదితరులు

గోల్నాక, మే 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్ కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను సీఐటీయూ అంబర్‌పేట నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎం.వెంకటేష్ నగర ఉపాధ్యక్షుడు జి.రాములు మున్సిపల్ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎం.వెంకటేష్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో 18,500మంది మున్సిపల్ కార్మికులు పనిచేస్తూ నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వీరి గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సి.మల్లేష్, మున్సిపల్ కార్మికులు జయశ్రీ, మంజుల, లలిత, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం కలిగి ఉండాలి


ప్రొ.వీఎల్‌వీఎస్ఎస్.సుబ్బారావును సత్కరిస్తున్న డాక్టర్ సరోజ వివేక్

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో తగిన నైపుణ్యంతో విద్యార్థులు సిద్ధంగా ఉండాలని, అందువల్ల అవి ఉద్యోగ అవకాశాల్లో ముఖ్యపాత్ర పోషిస్తాయని వైఐఎన్‌యూ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ వీఎల్‌వీఎస్ఎస్.సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో స్కిల్ ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్‌పై దృష్టి కోణం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో స్కిల్ ఆధారిత విద్య అత్యవసరమన్నారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రిన్సిపాల్, హెచ్ఓడీలు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి : కార్పొరేటర్


అధ్వానంగా మారిన బాకారం మెయిన్ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి తదితరులు

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): దాయారా మార్కెట్ నుంచి బాకారం మెయిన్ రోడ్‌లో నూతన సీసీ రోడ్లు వెంటనే నిర్మించి, ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి అధ్వానంగా మారిన బాకారం మెయిన్ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాయారా మార్కెట్ నుంచి బాకారం రోడ్డును నూతనంగా నిర్మించేందుకు రూ.1.20 కోట్లను గత కమిషనర్ మంజూరు చేశారని పేర్కొన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పనులు ప్రారంభించి సంవత్సరం జరిగినా పనులు చేయడం లేదని ఆరోపించారు. రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలి దుమ్మధూళి రావడంతో వాహనదారులు, పాదచారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రోడ్డు నిర్మించకపోతే ప్రజలతో కలిసి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా సివిల్ రైట్ డే నిర్వహించాలి


తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న సిరిగిరి శ్యామ్ తదితరులు

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ప్రతి నెలా సివిల్ రైట్ డేను నిర్వహించాలని ఆలిండియా హ్యూమన్ రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ (ఏఐహెచ్ఆర్‌జీహెచ్) అధ్యక్షుడు సిరిగిరి శ్యామ్ పేర్కొన్నారు. ఎవరైనా పౌర హక్కులకు భంగం కలిగించినా, కుల వివక్షత చూపించినా తక్షణమే రక్షణ కోసం ఫిర్యాదు చేసే చట్టాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాకం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్ కృషి.. బతుకమ్మకుంట ఖుషి!

- చెరువు వద్ద సంబరాలు నిర్వహించిన వివిధ బస్తీల మహిళలు
- వీహెచ్, హైడ్రా, సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మహిళలు


బతుకమ్మకుంటలో హైడ్రా తవ్వుతున్న చెరువు వద్ద సంబరాలు చేస్తున్న స్థానిక మహిళలు

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): 'కబ్జాదారుల కబంధహస్తాల నుంచి బతుకమ్మ కుంట స్థలాన్ని రక్షించారు. మహిళలు బతుకమ్మలు వేసేందుకు వీలుగా హైడ్రా ఆధ్వర్యంలో బతుకమ్మకుంట చెరువుకు పునర్‌జీవం పోయడాన్ని స్వాగతించారు. బతుకమ్మకుంట, శారదానగర్, శ్రీనివాసనగర్, కుమ్మరబస్తీ, చెంచుబస్తీ తదితర ప్రాంతాల మహిళలు మంగళవారం చెరువు వద్ద పూజలు చేసి, సంబరాలు' నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు హేమలత, విజితారెడ్డి, భాగ్య, శాంతమ్మ, కవిత, సురేఖ తదితరులు మాట్లాడుతూ బతుకమ్మకుంట చెరువును పునరుద్ధరించాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు. వీహెచ్ పోరాటం న్యాయమైనదని, ఇందుకు స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా ద్వారా చెరువు పునర్‌నిర్మించే పనులు చేపట్టడం హర్షణీయమన్నారు. గతంలో చెరువు ఉండేదని, చిన్నప్పుడు ఈ చెరువు పక్కన బతుకమ్మ ఆడి ఆ చెరువులో బతుకమ్మలు వేసేవారమని మహిళలు గుర్తు చేసుకున్నారు. మధ్యలో కొంతమంది ఆ చెరువును కూల్చివేసి కబ్జాచేయడం వల్ల ఇక్కడ చెరువు లేకుండా పోయిందని వాపోయారు. చెరువును పునరుద్ధరించాలని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి తాము విన్నవించినా స్పందించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము వీహెచ్‌ను కలిసి చెరువును తవ్వించాలని కోరామన్నారు. ఇందుకు స్పందించిన ఆయన హైడ్రాను కలిసి చెరువును పునరుద్ధరించే పనులుచేయడం స్థానికంగా మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే బతుకమ్మ పండగను బతుకమ్మకుంటలో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శనతో అమరజవాన్లకు నివాళి


అమరజవాన్లకు నివాళులర్పిస్తూ క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న సామాజిక తెలంగాణ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సైదులు, ప్రఫుల్ రాంరెడ్డి తదితరులు

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులను అణచివేసేందుకు భారత ప్రభుత్వం చేస్తున్న పోరాటానికి ప్రజలందరూ అండగా ఉండాలని పాక్ దుశ్చర్యలను ఎండగట్టాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి సూచించారు. మంగళవారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు వద్ద అమనగంటి సైదులు ఆధ్వర్యంలో యుద్ధంలో అమర జవాన్లకు నివాళులర్పిస్తూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన చనిపోయిన జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక తెలంగాణ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు సీహెచ్.రాజ్‌కుమార్‌గౌడ్, జేఏసీ నాయకులు మాచర్ల వెంకటస్వామి, గంగపుత్రసంఘం అధ్యక్షుడు మెట్టు ధన్‌రాజ్, నాయకులు రాజులార, లావణ్య, చంద్రన్న, ప్రసాద్, యాదగిరి, సిరి, రవికుమార్, రాజు, సుజీ తదితరులు పాల్గొన్నారు.

సిటీసెంట్రల్ లైబ్రరీలో..


మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న ఉపేందర్‌రెడ్డి, నిరుద్యోగులు, పోటీపరీక్షల అభ్యర్థులు

చిక్కడపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులను మట్టుబెట్టే క్రమంలో అసువులు బాసిన తెలుగుబిడ్డ, వీర జవాన్ మురళీనాయక్‌కు మంగళవారం రాత్రి చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగులు, పోటీపరీక్షల అభ్యర్థులు ఘననివాళులు అర్పించారు. మురళీనాయక్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. హైదరాబాద్ నగర కేంద్రగ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పొట్లూరు పద్మజ, అజ్మీర బాలకోటినాయక్, మిద్దెసురేష్, శంకర్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శేషవాహన సేవ


శేషవాహనసేవలో దర్శనమిస్తున్న స్వామి

చిక్కడపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శేషవాహనసేవ కనులపండువగా జరిగింది. ఈ శేషవాహనసేవ చిక్కడపల్లి శ్రీనివాసపురం తిరువీధులగుండా ఊరేగించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, కీర్తి దంపతులు, ఈవో అన్నపూర్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తెలంగాణ రత్న పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం (జూన్ 2) పురస్కరించుకుని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో తెలంగాణ రత్న పురస్కారాలు- 2025 ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ ఈఎస్ఎస్.నారాయణ మాష్టార్ తెలిపారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాలలో మట్టిలో మాణిక్యంగా ఉన్నకవులు, రచయితలు, సంగీతం, నృత్యం, రంగస్థల కళాకారులు, ఉపాధ్యాయులు, వైద్యులు, విద్యావంతులు, సామాజిక సేవకులు, ఆధ్యాత్మికం, క్రీడలు, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారికి తెలంగాణ రత్న, తెలంగాణ కీర్తి, ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు సంస్థ కార్యాలయం గోకుల్‌నగర్, 1-20-164, తిరుమలగిరి, సికింద్రాబాద్‌కు పంపించాలని, వివరాలకు 9652347207లో సంప్రదించాలని ఆయన కోరారు.

న్యాయవాదుల సామాజిక సేవ అభినందనీయం


నాంపల్లి కోర్టులో అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తెలంగాణ న్యాయవాదుల సురక్ష సమితి అధ్యక్షుడు అశోక్, నిర్వాహకులు నరేష్ తదితరులు

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంఅభినందనీయం అని తెలంగాణ న్యాయవాదుల సురక్ష సమితి అధ్యక్షుడు అశోక్ పేర్కొన్నారు. హైకోర్టు న్యాయవాది నరేష్‌స్వామి ఆధ్వర్యంలో మంగళవారం నాంపల్లి కోర్టులో అంబలి పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అశోక్ ప్రారంభించి మాట్లాడారు. వేసవి కాలంలో న్యాయవాదులు, ఉద్యోగులు, ప్రజలకు ఉచితంగా అంబలి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాయవాదుల సురక్ష సమితి ప్రధాన కార్యదర్శి మహ్మద్, సీనియర్ న్యాయవాదులు తిరుపతివర్మ, వంశీకృష్ణ, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ


అడిక్‌మెట్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కట్ట రాములు

- రాంనగర్, ఆంధ్రజ్యోతి.

హనుమాన్ టెంపుల్ లేన్‌లో రోడ్డు వేయాలి

చిక్కడపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ హనుమాన్ టెంపుల్ లేన్‌లో కొత్తరోడ్డు వేయాలని టీజేఎస్ గాంధీనగర్ డివిజన్ కన్వీనర్ గుండెల్లి రవీందర్ మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. త్యాగరాయగానసభ నుంచి హనుమాన్‌టెంపుల్ వెళ్లే రోడ్డుతోపాటు అక్కడి నుంచి జవహర్‌నగర్ మెయిన్‌రోడ్ దాకా రోడ్డు గుంతలమయంగా మారిపోయిందన్నారు. వాహనచోదకులు, పాదచారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డులో కచ్చామోరీ నాలా రిపేర్ పనులు త్వరగా పూర్తిచేసి నూతన రోడ్డు వేయాలని కోరారు.

అడిక్‌మెట్ కార్పొరేటర్ అత్త మృతి


కమలమ్మ (ఫైల్)

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ కార్పొరేటర్ సునీతాప్రకాష్‌గౌడ్ అత్తమ్మ సిద్ధగొని కమలమ్మ(85) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు సాయంత్రం పార్శీగుట్టలో గౌడ సంఘం శ్మశాన వాటికలో జరిగాయి. ఆమె మృతి పట్ల ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తీవ్ర సంతాపం తెలిపారు. ఆమె అంత్యక్రియల్లో బీఆర్ఎస్ నాయకులు నేత శ్రీనివాస్, రవియాదవ్, సురేందర్, మహ్మద్ ఖదీర్, పరకాల మనోజ్‌కుమార్‌గౌడ్, మహ్మద్ జహంగీర్, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు రాజేశ్వరిగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, భిక్షపతి, లింగాల శ్రీకాంత్‌గౌడ్, ఆమె కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యాదవులు ఐక్యంగా హక్కులను సాధించుకోవాలి


బాబూరావు యాదవ్‌ను, ప్రధానకార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న హరిబాబు యాదవ్

ముషీరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత యాదవ మహాసభ జాతీయ చీఫ్ ప్యాటన్‌గా బద్దుల బాబూరావు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం అఖిల భారత యాదవ మహాసభ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో బాబూరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎడ్ల హరిబాబు యాదవ్ ఘనంగా సన్మానించారు. అనంతరం బద్దుల బాబూరావు యాదవ్ మాట్లాడుతూ.. యాదవలంతా ఐక్యంగా ఉన్నప్పుడే తమ న్యాయమైన హక్కులను సాధించుకోవచ్చన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో యాదవులకు సముచిత స్థానం కల్పించేలా రాజకీయాలకు అతీతంగా ఐక్య పోరాటాలు చేయాలన్నారు. త్వరలో అఖిల భారత యాదవ మహాసభ పూర్తిస్థాయి కమిటీలను ప్రకటిస్తామని తెలిపారు.

వడదెబ్బతో జాగ్రత్త

ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి



ఆంధ్రజ్యోతి, మే 13 (ఆంధ్రజ్యోతి): మార్చి ప్రారంభం నుంచే ఎండలు భగ్గుమంటున్నాయని. ఉదయం 11 గంటలకే ఎండలు దంచి కొడుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండల వల్ల వడదెబ్బ తగిలితే ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడే అవకాశాలు ఉంటాయి. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల పై ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం(యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: వడదెబ్బ అంటే ఏమిటీ...?

డాక్టర్: వడదెబ్బ అంటే ఎక్కువ ఉష్ణోగ్రతల తాకిడికి గురైన కారణంగా శరీరంలోని వేడిని నియంత్రించే విధానం విఫలమై ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుంది. వేడిని శరీరం తట్టుకోలేనప్పుడు వడదెబ్బ తగులుతుంది.

ఆంధ్రజ్యోతి : వడదెబ్బ తగిలినప్పుడు ఏమి జరుగుతుంది..?

డాక్టర్: అధిక ఉష్ణోగ్రతకు గురికావడం వల్ల అలసట, తిమ్మిర్లు, బలహీనం, తలనొప్పి, చర్మం పొడిగా మారడం తదితర మార్పులు సంభవిస్తాయి.

ఆంధ్రజ్యోతి: వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఎవరికి ఎక్కువగా ఉంటుంది..?

డాక్టర్: పిల్లలు, వృద్ధులు, ఎక్కువ గంటలు ఎండలో పనిచేసేవారికి బలహీనంగా ఉన్నవారు, వివిధ అనారోగ్య సమస్యలతో మందులు వాడే వారు వడదెబ్బ వల్ల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: వడదెబ్బ నివారణకు చర్యలు ఏమిటి..?

డాక్టర్: అధికంగా మంచినీరు, చల్లని ద్రవాలు తీసుకోవాలి. వదులుగా ఉండే లేత రంగు దుస్తులు ధరించాలి. ఆల్కాహాల్‌కు దూరంగా ఉండాలి. పండ్ల రసాలను ఎక్కువగా తీసుకోవాలి. తేలికపాటి వ్యాయామం చేయాలి. అవసరమైతే డాక్టర్‌ను సంప్రదించాలి.

ఆంధ్రజ్యోతి: వడదెబ్బ తగిలితే వెంటనే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

డాక్టర్: డాక్టర్‌ను సంప్రదించాలి. అధిక ఉష్ణోగ్రతల వల్ల ప్రాణాపాయస్థితి ఏర్పడే అవకాశాలు ఉంటాయి. డాక్టర్ల సూచనలు, సలహాలు పాటించాలి.

వీర సైనికులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి


కాచిగూడలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న పీస్ కమిటీ సభ్యులు

బర్కత్‌పుర, మే 13(ఆంధ్రజ్యోతి) : దేశం కోసం ప్రాణాలను త్యాగం చేస్తున్న వీర సైనికులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సెంట్రల్ పీస్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఈస్ట్ జోన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు శరత్‌శ్యామ్ పిలుపునిచ్చారు. భారత్ - పాక్ సరిహద్దుల్లో నెలకొన్న వాతావరణం నేపథ్యంలో నగరంలోని అన్ని వర్గాల ప్రజల మధ్య శాంతిని ఆకాంక్షిస్తూ పీస్ ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ పీస్ వెల్ఫేర్ కమిటీ, ఈస్ట్ జోన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడ పీఎస్ నుంచి కాచిగూడ రైల్వే స్టేషన్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. భారత సైనికులకు తమ మద్దతు తెలుపుతూ పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది పర్యాటకులకు సంతాపం తెలిపారు. రాబోయే బక్రీద్, మొహర్రం, బోనాల వేడుకలను నగరవాసులు శాంతియుతంగా జరుపుకోవాలని వారు సూచించారు.

మంజూరైన పనులు చేపట్టాలి: కార్పొరేటర్


మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, మే 13(ఆంధ్రజ్యోతి) : కాచిగూడ డివిజన్‌లో మంజూరైన పనులను వెంటనే చేపట్టాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే డివిజన్‌లో సీసీ రోడ్లు మంజూరయ్యాయని వాటి పనులు చేపడితే స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. మంగళవారం నింబోలిఅడ్డలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ ప్రశాంత్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన ప్రాంతాల్లో కొత్త రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ఇప్పటి వరకు చేపట్టిన సీసీ రోడ్లు, పైప్‌లైన్ల పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు బల్బీర్, క్షీరసాగర్, అరవింద్, వాసు, నరేష్, భీమ్‌రాజ్, రవియాదవ్, ఆర్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గణేష్

నల్లకుంట, మే 13(ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కందుకూరి గణేష్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం విద్యానగర్‌లోని పీడీఎస్‌యూ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. దోపిడీ, పీడన, అణచివేత లేని మహోన్నత విలువలు కలిగిన సమ సమాజం కావాలని పోరాడుతున్నట్లు పేర్కొన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థులు పాఠశాలల్లో మౌలిక వసతులు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌లు సకాలంలో అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాణ్యమైన విద్యా సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ తనకు అప్పగించిన బాధ్యతను తప్పకుండా నెరవేరుస్తానని అన్నారు.